# గాయం

రామరాజు తరచుగా తన ఇంటికి రావడం వరూధినికి ఇష్టం లేదు. చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు ఏదో అనుకుంటారని కాదు. వరూధినికే ఇష్టం లేదు. అలాగని రామరాజుతో ఏం చెయ్యటానికీ తోచలేదు. అతడితో పూర్తిగా కట్ చేసుకోవచ్చు. కానీ మనసులో ఏ మూలనో ఆశ. అతడి మనసులో ఏముందో స్పష్టంగా తెలీదు. అంతా తన ఊహ మాత్రమే. ఊహాజనితమైన ఆలోచనలతో తన భవిష్యత్తును తానే పాడుచేసుకున్నట్లవుతుంది.

వరూధిని ఆలోచిస్తోంది. ఇంతకుముందైతే రామరాజు రాక వరూధినికి సంతోషాన్ని కలిగించేది. అతడు రాగానే నవ్వుతూ ఆహ్వానించేది. తెరిపిలేకుండా కబుర్లు చెబుతూ ఇంట్లో పనులు చేసుకునేది. రామరాజు సన్నిధిలో అతడు తనవాడనే ఫీలింగ్ కలిగేది. ఆ ఫీలింగ్ ఆమెకు సంతోషాన్ని, తృప్తిని ఇచ్చేది. అందుకే ఇన్ని రోజులనుంచి అతడి రాకను సంతోషంగా భరించింది. ఈమధ్యనే వరూధిని ఫీలింగ్‌కు కత్తెరపడింది.

ఆ కత్తెర ఎవరో కాదు. వరూధిని చెల్లెలు దేవయాని. దేవయాని వరూధిని కంటే మూడేళ్ళు చిన్నది. తన కన్నవారి దగ్గిర ఆ చిన్న వూళ్ళో వుండి చదువుకుంటున్న చెల్లెల్ని ఈమధ్యనే వరూధిని తనకు తోడుగా వుంటుందని భావించి తన ఇంటికి రప్పించుకుంది. ఎందుకంటే కలలో కూడా ఊహించని విధంగా వరూధినికి వున్న తోడు ఈమధ్యనే కరువయింది. వరూధిని భర్త విశ్వనాథం కొన్నాళ్ళ క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతడు ఒక ప్రభుత్వ కార్యాలయంలో ఉ ద్యోగం చేసేవాడు. భర్త మరణానంతరం డిగ్రీ వరకు చదువుకున్న వరూధినికి అదే ఆఫీసులో ఉద్యోగం ఇచ్చారు. పెళ్ళయిన ఏడాదికే భర్తను పోగొట్టుకున్న వరూధినికి పిల్లల్లేరు. ఆ పట్నంలో రెండు గదుల ఇంటిని అద్దెకు తీసుకుని ఆఫీసుకు వెళుతోంది వరూధిని. తనకు తోడుగా చెల్లెలు కూడా వుంటే బావుంటుందని భావించి దేవయానిని తీసుకువచ్చి చేర్పించింది. దేవయాని డిగ్రీ చదువుతోంది.

దేవయాని రాక తనలో అశాంతిని రేపుతుందని వరూధిని ముందుగా ఊహించలేదు. తీరా వచ్చిన తర్వాత ఆమెలో ఒక భయం ప్రవేశించింది. దేవయాని అక్క కంటే అందంగా వుంటుంది. చురుకుదనం, చొరవా ఎక్కువే. తన ఇంటికి తరచూ వచ్చే రామరాజుని దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే దేవయాని కారణంగా తనకు జరిగే కీడే ఎక్కువ అనిపించింది. ఇంతేకాకుండా దేవయాని వచ్చిన

దగ్గరనించీ రామరాజుకు తనపట్ల కాన్సన్ట్రేషన్ తగినట్లుగా అనిపిస్తోంది. దేవయానిక్కూడా తల్లిదండ్రులు పెళ్ళి చేసే ఆలోచనలో వున్నారు. పెళ్ళికాని రామరాజు పట్ల ఆకర్షితురాలు కావడానికి తన చెల్లెలు దేవయానికి ప్రత్యేకించిన కారణాలు అవసరంలేదు. అందం, చదువు, ఉద్యోగం వున్న యువకుడిని ఒక ఆడపిల్ల పెళ్ళాడాలని అనుకోవటానికి ఈ అర్హతలు చాలు. ఈ కారణాలవల్లనే వరూధినికి రామరాజు తన ఇంటికి తరచుగా రావడం ఇష్టం లేకపోయింది.

కానీ రామరాజు వచ్చాడు. ఊరికే రాలేదు. చేతిలో పెద్ద స్వీట్ ప్యాకెట్టు. మొహం నిండా నవ్వుతో వచ్చాడు. కొత్త బట్టలు ధరించాడు. అందంగా వుండే అతడు మరింత అందంగా కనిపించాడు. తలస్నానం చేసినందువల్ల తలవెంట్రుకలు గాలిలో ఎగురుతున్నాయి. వరూధిని అతడిని రెప్ప వాల్చకుండా చూసింది. దేవయాని కూడా.

ఆరోజు ఆదివారం కావడంతో వరూధినికి ఆఫీసు లేదు. దేవయానికి కాలేజీ లేదు. ఇంట్లోనే వున్నారు.

"ఏమిటో విశేషం?" అన్నది వరూధిని అతడి చేతిలో నుంచి స్వీట్ ప్యాకెట్టును తీసుకుంటూ.

"ఈ రామరాజు పుట్టినరోజు" అని నవ్వాడు.

"అబద్ధం" అన్నది దేవయాని నవ్వుతూ.

"కాదు, నిజం" అన్నాడు రామరాజు.

"ఇవాళ ఆదివారం అయితే ఇవాల్టిరోజు ఎలా పుట్టివుంటారు?" అన్నది దేవయాని.

రామరాజు పెద్దగా నవ్వి "గుడ్ జోక్. గుర్తుంచుకుంటాను. నా పుట్టినరోజు వచ్చినంతకాలం ఈ జోకును మరచిపోను దేవయానీ" అన్నాడు అలాగే నవ్వుతూ.

వరూధిని మాత్రం నవ్వలేదు. మౌనంగా వుండిపోయింది.

ఇద్దరూ అతడికి విషెస్ చెప్పారు.

అతడు థ్యాంక్స్ చెప్పిన తరువాత "నిన్న ఆఫీసులో చెప్పలేదేం?" అన్నది వరూధిని.

"మిమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేద్దామని" అన్నాడు రామరాజు.

అప్పటికప్పుడే దేవయాని ఆ ప్యాకెట్టును విప్పి వాళ్ళిద్దరికీ స్వీట్లు ఇచ్చింది.

తనూ తిని కాఫీ కలపడానికి వంటగదిలోకి వెళ్ళింది.

అప్పుడు రామరాజు మాట్లాడాడు.

"ఇవాల్టి ప్రోగ్రాం చెబుతున్నాను వరూధినిగారూ.... ఈపూట నేను మీ అతిథిని. నా భోజనం మీ సమక్షంలోనే సాయంత్రం ముగ్గురం ఎగ్జిబిషన్‌కి వెళుతున్నాం. తిరిగి వస్తూ ఏసీ హొటల్లో భోజనం. ఈ ప్రోగ్రాంలో మార్పులేదు. ఎవరూ ఈ ప్రోగ్రాంని మార్చే ప్రయత్నం చెయ్యకండి.... ఒప్పుకోను" అన్నాడు రామరాజు పెద్దగా వంటగదిలో వున్న దేవయానికి కూడా తన మాటలు వినిపించేలా.

అతడు అంత పెద్దగా ఎందుకు మాట్లాడాడో దేవయానికి అర్థమై నవ్వుతూ వంటగదిలోంచి బయటికి వచ్చి రామరాజుకు కాఫీగ్లాసును ఇస్తూ "మీ ప్రోగ్రాం నాకు నచ్చింది. ఇందులో ఏమీ మార్పు లేదు" అన్నది అక్కడే కుర్చీలో కూర్చుని.

"వరూధినిగారిక్కూడా ఈ ప్రోగ్రాం నచ్చిందనుకుంటాను" అన్నాడతను.

"అలాగని చెప్పానా?" వరూధిని వెంటనే అంది.

"మీరు నా మాట వింటారనే నమ్మకం నాకుంది. ఆ నమ్మకంతోనే చెప్పాను. కాదంటే చెప్పండి. మొహం మాడ్చుకుని ఇప్పుడే ఇక్కడినుంచి వెళ్ళిపోతాను" అన్నాడు రామరాజు.

వరూధిని నవ్వి "మొహం మాడ్చుకోవద్దులెండి. మేం చూడలేం. సరే. మీ మాట వింటున్నాను" అన్నది.

"థ్యాంక్స్ అక్కా" అన్నది దేవయాని కళ్ళను మెరిపిస్తూ. ఆ మెరుపు దేవయాని మనసులో చీకటిని నింపింది.

ఒక నిమిషం తర్వాత "పద వంట ప్రయత్నం చేద్దాం" అన్నది వరూధిని.

"నువ్వెళ్ళు. నాకు బద్ధకంగా వుంది" అన్నది దేవయాని.

"వెళ్ళు యానీ. వెళ్ళి అక్కకు సాయం చెయ్యి" అన్నాడు రామరాజు.

వరూధిని ఆశ్చర్యపడిది. అతడు అలా అంటాడని అనుకోలేదు. దేవయానితో ఒంటరిగా వుండే అవకాశాన్ని అతడు వదులుకుంటాడని ఊహించలేదు. అంతే తను అనుకుంటున్నట్టుగా రామరాజు మనసులో ఏమీ లేదన్నమాట. తేలిగ్గా నిట్టూర్చింది వరూధిని.

దేవయాని వంటగదిలోకి వెళ్ళింది.

రామరాజు టీవీ ఆన్‌చేసి చూస్తూ కూర్చున్నాడు. అతడి మనసు టీవీ మీద లేదు. వంటగదిలో నుండి మాటలు వినపడుతున్నాయి.

"సాయంత్రం ఎగ్జిబిషన్‌లో జెయింట్ వీల్ ఎక్కుదామా?" దేవయాని అడుగుతోంది.

"నాకు భయం" అంది వరూధిని.

"చిన్నపిల్లలా భయమేవిటి? ఎక్కుదాం. నాకిష్టం. భలేగా వుంటుంది" అంటోంది దేవయాని.

"సరే చూద్దాంలే" అన్నది వరూధిని.

తప్పకుండా జెయింట్ వీల్ ఎక్కాలని అనుకున్నాడు రామరాజు.

ఆ మధ్యాహ్నం వారితో కలిసి రామరాజు అక్కడే భోజనం చేశాడు.

సాయంత్రం దాకా పేకాడుకుంటూ కూర్చున్నారు. సాయంత్రం లేచారు. ఆరయింది. వరూధినీ, దేవయానీ సబ్బుతో మొహాలు కడిగి పౌడరు అద్దుకుని సిద్ధమయ్యారు.

రామరాజు కూడా తయారయి "నా పుట్టినరోజు బాగా గడిచింది" అన్నాడు ఇంట్లోనించి బయటకు వస్తున్నప్పుడు. అతడి తృప్తి వరూధినికి సంతోషాన్ని కలిగించింది. ఆటోలో ఎగ్జిబిషన్ గ్రౌండుకి వెళ్ళారు. ఆదివారం కావడంతో జనం ఎక్కువగానే వున్నారు. పలచగా దుమ్ము రేగుతోంది.

చిన్నగా ఒక్కొక్క స్టాల్ చూసుకుంటూ నడుస్తున్నారు. దేవయాని ఒక స్టాలు ముందు ఆగింది. స్త్రీల అలంకరణ సామగ్రి అమ్మే స్టాలు అది. నెయిల్ పాలీష్‌లూ, స్టిక్కర్లూ, హెయిర్ క్లిప్పులూ ఎక్కువగా వున్నాయి. దేవయాని ఆసక్తిగా చూస్తోంది.

రామరాజు దేవయాని ఆసక్తిని గమనించి కొన్ని గోళ్ళరంగు సీసాలు, స్టిక్కర్లు, హెయిర్ క్లిప్పులు కొని ఆమెకు ఇచ్చాడు. అది చూసి వరూధిని ముఖాన్ని చిన్నబుచ్చుకుంది. రామరాజు గ్రహించాడు. ఆ పక్కనే వున్న స్టాల్లో ఖరీదైన బాడీ స్ప్రే బాటిల్‌ను కొని వరూధినికిచ్చాడు. వరూధిని థ్యాంక్స్ చెప్పింది మొహాన్ని వికసింపచేసుకుని.

"మీరేమీ కొనుక్కోరూ?" దేవయాని అడిగింది రామరాజుని.

రామరాజు నవ్వాడు కానీ జవాబు చెప్పలేదు. ఆ పక్కనే హ్యాండీక్రాఫ్ట్స్

స్టాలుంది. అందులోకి నడిచారు. అక్కడ రకరకాల కళాత్మక వస్తువులున్నాయి. కొంచెంసేపు అన్నింటినీ చూసి యాష్‌ట్రేని కొన్నాడు. అది అతడికి బాగా నచ్చింది.

"ఇదెందుకు?" అడిగింది దేవయాని.

"సిగరెట్లు కాల్చేవాళ్ళకు తెలుస్తుంది" అన్నాడు రామరాజు.

"చాలా బాగుంది" అంది వరూధిని.

"మీ టేస్ట్ బాగుంది" అన్నది దేవయాని తర్వాత.

రామరాజు థ్యాంక్స్ చెప్పాడు. తర్వాత అక్కడనుంచి ముందుకెళ్ళారు. అక్కడే జెయింట్ వీల్ వుంది. జనం వున్నారు. చప్పుడు చేస్తూ జెయింట్ వీల్ తిరిగుతోంది. తిరుగుతున్న మనుషులు కేరింతలు కొడుతున్నారు.

"మనం కూడా ఎక్కుదాం" అన్నది దేవయాని.

"నాకు భయం" వరూధిని అన్నది.

"పక్కనే నేనున్నాగా.... భయమెందుకు?" అన్నాడు రామరాజు.

"అందుకే అక్క భయపడుతోంది" అన్నది దేవయాని నవ్వి.

రామరాజు కూడా నవ్వి కౌంటర్‌లో టికెట్లు తీసుకున్నారు.

"ఒక్కసారి ఎక్కండి.... మీ భయం పోతుంది" అన్నాడు రామరాజు.

జెయింట్ వీల్ ఆగింది. జనం దిగుతున్నారు. ఖాళీ అయినకొద్దీ జనాన్ని ఎక్కిస్తున్నారు.

వరూధిని ముందు నిల్చున్న స్త్రీ ఒకామె ఖాళీ అయిన కుర్చీలో కూర్చుంది. చేసేదిలేక వరూధిని ఎక్కి ఆ స్త్రీ పక్కన కూర్చుంది. తర్వాత దేవయాని గబగబా ఎక్కి ఖాళీగా వున్న సీటులో కూర్చుంది. అది ఇద్దరు కూర్చునే సీటు. పక్క సీటు ఖాళీగా వుంది.

"ఇక్కడ కూర్చోండి" అంది దేవయాని తన పక్కనే ఖాళీగా వున్న సీటును రామరాజుకు చూపుతూ. రామరాజు ఒకసారి వరూధినికేసి చూసి దేవయాని పక్కన కూర్చున్నాడు.

జెయింట్ వీల్ కదిలింది. కూర్చున్న జనం పెద్దగా అరిచారు. దేవయాని కూడా సంతోషంతో అరిచింది.

"అంత పరవశమా?" అన్నది వరూధిని తల తిప్పి కోపంగా చెల్లెల్ని చూస్తూ. దేవయాని మాట్లాడలేదు.

రామరాజు నవ్వి "వరూధినిగారూ! నాకు తెలిసి యానీలో ఇంకా చిన్నతనం పోలేదు. నిజానికి నేను కూడా అరిచేవాడినే. మిమ్మల్ని చూసి ఆగిపోయాను" అన్నాడు.

దేవయాని నవ్వింది.

జెయింట్ వీల్ వేగాన్నందుకుంది. పైకి పోతున్నప్పుడు ఏమీ అనిపించలేదు గానీ కిందకు దిగుతున్నప్పుడు మాత్రం జారిపోతున్నట్టు అనిపించి భయమేసి ముందు కూర్చున్న రామరాజు భుజాల మీద చేతులు వేసి గట్టిగా పట్టుకుంది వరూధిని. నవ్వుకున్నాడు రామరాజు.

క్రమంగా భయం తగ్గింది వరూధినికి.

దేవయాని ఏదో చెప్పింది గానీ రామరాజుకి వినపడలేదు.

దేవయాని రాసుకున్న పౌడరు వాసన అతనికి హాయిని గొలుపుతోంది. ఏమీ జరగనట్ట దేవయాని రామరాజు చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కింది. తర్వాత జెయింట్ వీల్ ఆగింది.

దిగారు.

"భయం పోయిందా?" అడిగాడు రామరాజు దిగిన తర్వాత.

వరూధిని నవ్వుతూ తల ఊపింది.

"ఇంకోసారి వద్దామా?" అడిగింది దేవయాని.

"మీరిద్దరూ రండి" అన్నది వరూధిని విసురుగా.

రామరాజు చేతిని తను పట్టుకోవడాన్ని అక్కయ్య చూసింది అనుకుంది దేవయాని ఆమె విసురుని చూసి.

బయటకు వచ్చారు. అక్కడకు దగ్గరలో వున్న ఏసీ హోటల్‌దాకా నడిచారు. హోటల్లో అంతగా జనం లేరు. కొంచెం ఖాళీగా వుంది.

అదే మొదటిసారి దేవయాని ఒక ఏసీ హోటల్లో భోజనం చెయ్యడం. కొత్త అనుభూతి. మనసులోనే రామరాజుకు థ్యాంక్స్ చెప్పుకుంది. వరూధినీ ఏమీ ఫీలవలేదు. మామూలుగానే వుంది.

భోజనానంతరం కిళ్లీలు నములుతూ బయటకొచ్చారు.

"నా గదికి వెళతాను" అన్నాడు రామరాజు హోటల్ బయట ఆగి.

"పొద్దుపోయింది కదా. ఇంత రాత్రివేళ ఎక్కడో ఊరి బయట కాలనీలో

వున్న మీ గదికి ఏం వెళతారు? మాతో రండి. మేడమీద పక్కలు పరుచుకుని వెన్నెల్లో సరదాగా కబుర్లు చెప్పుకుంటూ పడుకుందాం" అన్నది దేవయాని.

వరూధిని మాట్లాడలేదు. రోడ్డుమీద తిరుగుతున్న మనుషులనీ, మోటారు వాహనాలనీ చూస్తూ నిలుచుంది.

వరూధిని కూడా తనను ఇంటికి రమ్మని అనుకున్న రామరాజు ఆమె మౌనంగా ఉండడంతో బాధపడ్డాడు. రోడ్డుమీద ఖాళీగా వెళుతున్న ఆటోని ఆపి "సారీ వెళతాను" అన్నాడు.

ఆటో కదిలి వెళుతున్నప్పుడు వరూధిని రామరాజుకు "థ్యాంక్స్" చెప్పింది.

దేవయాని అక్కయ్యను అదోలా చూసి వరూధిని మౌనాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేసింది.

ఇద్దరూ ఆటోలో ఇంటికి వచ్చారు. భోజనాల పని లేదు. కాబట్టి ఇంట్లోకి రాగానే పక్కబట్టలు తీసుకుని పైకి వెళ్ళారు. పక్కలు పరుచుకుని పడుకున్నారు. వెన్నెలరాత్రి.

రామరాజు కూడా తమతో వచ్చివుంటే బావుండేది అనుకుంది దేవయాని. వరూధిని అలా అనుకోలేదు. దేవయాని లేకుండా వున్నట్టయితే అలా అనుకునేదేమో!

వరూధినికి నిద్ర రాలేదు. కళ్ళు మూసుకుంటే రామరాజు రూపం కనబడింది. తనని ప్రేమించాననీ, పెళ్ళి చేసుకుంటాననీ రామరాజు అంటాడేమోనని వరూధిని అనుకున్నది. కానీ అతడు బయటపడలేదు. ఇలా ఎంతకాలం? ఇప్పుడు దేవయాని కూడా వచ్చింది. భర్తను కోల్పోయిని తనని చేసుకోవడంకంటే తనకంటే అందంగా వుండే తన చెల్లెల్ని చేసుకోవడానికి రామరాజు ఇష్టపడతాడు. అవును అంతే. అలాంటప్పుడు అతడి గురించి తనెందుకు తాపత్రయపడాలి? కాకపోతే ఆఫీసు పనుల్లో తన కొలీగ్‌గా తనకు సాయపడతాడు. అదొక్కటే కృతజ్ఞత. ఇలా పరిపరివిధాలుగా ఆలోచించి చివరకు రామరాజు వల్ల తనకు ఉపయోగం లేదనీ, ఆరాటపడాల్సిన అగత్యం లేదనీ నిర్ధారించుకుని వరూధిని ఎప్పటికో నిద్రపోయింది.

దేవయాని మాత్రం రామరాజుకు తనపట్ల ప్రేమ వుందనీ, తనని పెళ్ళి చేసుకుంటాడనీ అనుకుని అతడితో కలిసి ఎక్కడెక్కడో విహారాలు చేస్తూ ఆ రాత్రి నిద్రకు దూరమయింది.

తెల్లవారింది.

వరూధిని ఆఫీసుకీ, దేవయాని కాలేజీకి వెళ్ళారు. సాయంత్రం నాలుగు గంటలు కావస్తున్నప్పుడు రామరాజు ఆఫీసు బయటకు వచ్చి ఒక చెట్టుకింద నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు. అప్పుడు అతనికి గేట్లోంచి లోపలికి వస్తున్న దేవయాని కనబడింది.

రామరాజు ఆశ్చర్యంతో "ఏమిటీ రాక?" అనడిగాడు.

"క్లాసుల్లేవు. మిమ్మల్ని చూడాలనిపించింది. ఇంటికి వెళ్ళకుండా ఇలా వచ్చాను. కోరుకున్నట్టుగానే దర్శనమిచ్చాడు" అన్నది నవ్వుతూ.

"చిన్నగా మాట్లాడు. మీ అక్కయ్య వింటే నిన్ను ఇంట్లోంచి బయటకు పంపుతుంది" అన్నాడు రామరాజు.

❖ ❖ ❖

దేవయాని బలవంతంమీద అయిష్టంగా చెల్లెలితో కలిసి హిందీ సినిమా చూడటానికి ఓ థియేటర్‌కు వెళ్ళింది వరూధిని.

సినిమా బాగానే వుంది. దేవయానికి హిందీ సినిమాలు చూడటం ఇష్టం. వరూధినికి అంతగా ఇష్టం లేదు.

ఇంటర్‌నెట్‌లో వరూధిని, దేవయాని డ్రింక్‌లు తాగటానికి బయటకు వెళ్ళారు. అక్కడ దేవయానికి అంజలి కనబడింది.

అంజలి కూడా వరూధిని పనిచేసే ఆఫీసులోనే పనిచేస్తోంది. ఇద్దరికీ బాగానే పరిచయం ఉంది. ముందుగా అంజలిని చూసి వరూధిని పలకరించింది.

"ఒక్కదానివే వచ్చావా?" అడిగింది వరూధిని.

"జంటగానే రావాలనుకున్నాం. కానీ ఆయన చివరిక్షణంలో హాండిచ్చాడు" అన్నది అంజలి.

"ఇంతకీ హాండిచ్చిన ఆ మనిషెవరూ?" అడిగింది వరూధిని.

"ఇంకెవరు? మన రాజుగారు" చెప్పింది అంజలి.

షాకయింది వరూధిని. దేవయానిక్కూడా మతిపోయినట్లయింది. తను రామరాజుగారితో ఎన్ని కలలు కంది?

"రామరాజుగారితో కలిసి సినిమాకా? ఏమైనా నీకు ధైర్యం ఎక్కువే అంజలీ" అన్నది వరూధిని.

అంజలి నిర్లక్ష్యంగా నవ్వి "ఐనా కాబోయే మొగుడితో సినిమాకు రావటానికి

ధైర్యం ఎందుకు?" అన్నది.

"ఏమిటీ.... కాబోయే మొగుడా? రామరాజు గురించేనా నువ్వు మాట్లాడుతున్నది?" అన్నది వరూధిని.

"అవును. మన ఆఫీసులో పనిచేసే రామరాజు గురించే మాట్లాడుతున్నాను. ఏమయ్యిందో ఏమోగానీ మొన్న రాత్రి హడావిడిగా వచ్చి "మనిద్దరం త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం. సిద్ధంగా వుండు అని చెప్పాడు సీరియస్‌గా. ఇదీ కథ, రామరాజు కూడా వచ్చి వుంటే బావుండేది" అన్నది అంజలి.

"మూడు రోజుల క్రితమా?" అన్నది వరూధిని.

అంజలి అవునన్నది. అప్పుడు గుర్తొచ్చింది వరూధినికి. సరిగ్గా మూడు రోజుల క్రితం రామరాజుతో కలిసి తనూ, దేవయాని ఎగ్జిబిషన్‌కు వెళ్ళిన విషయం. "అక్కడ రామరాజు మనసు గాయపడే సంఘటన ఏం జరిగింది?" వరూధిని ఆలోచనలో పడింది. ❖

*వస్త్ర ప్రపంచం, మార్చి 2014*